ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 5 నవంబరు 2025



కేదారేశ్వరుని పూజకు వేళాయె!

- నేడు కార్తీక పౌర్ణమి
- హిందువులకు విశిష్టమైన పర్వదినం
- ఆలయాల్లో పూజలు, నదుల్లో దీపారాధన
- శివకేశవులకు ప్రీతికరమైన రోజు

6లో




ఒక్కోటి రూ. 4 లక్షలు

- అమ్మకానికి 'జగనన్న ఇళ్ల స్థలాలు'
- బాండు పేపర్లపై సంతకాలు
- కొందరు రెవెన్యూ అధికారుల సహకారం



● మెళియాపుట్టి మండల కేంద్రంలో ఉన్న కొండ ప్రాంతంలో గత ప్రభుత్వం జగనన్న లేఅవుట్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడ 181 ఇళ్ల స్థలాలు ఉండగా, 150 మందికి మాత్రమే పట్టాలు ఇచ్చింది. వీరిలో 135 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా అవి వివిధ దశల్లో ఉన్నాయి. ఇళ్ల పట్టాలు పొందిన వారిలో చాలామందికి సొంత ఇళ్లు ఉన్నాయి. దీంతో వారు తమ పట్టాలను ఇతరులకు అమ్మేస్తున్నారు. ఒక్కొక్క ఇంటి పట్టాను రూ.3.50 లక్షల నుంచి రూ.4 లక్షలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.



● మెళియాపుట్టి మండలం కరజాడ గ్రామంలో జగనన్న లేఅవుట్ కోసం గత ప్రభుత్వం ఓ వ్యక్తి వద్ద అధిక ధరకు భూమిని కొనుగోలు చేసింది. గ్రామానికి దూరంగా కొండ సమీపంలో ఉన్న ఈ స్థలంలో 44 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చింది. ఈ లేఅవుట్‌లో ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలకు ఒక్కరు కూడా ముందుకు రావడం లేదు. కొంతమంది తమ ఇళ్ల పట్టాలను వేరేవారికి విక్రయిస్తున్నారు.

మెళియాపుట్టి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరిట అధికంగా లేఅవుట్లు వేశారు. కొన్నిచోట్ల ప్రభుత్వ స్థలాల్లో వేయగా, మరి కొన్ని చోట్ల వైసీపీ నాయకుల భూములను అధిక ధరకు కొనుగోలు చేసి లేఅవుట్లు ఏర్పాటు చేశా రు. అయితే చాలా లేఅవుట్లు గ్రామాలకు దూరంగా కొండల సమీపంలో, ఎలాంటి సదుపాయాలు లేనిచోట ఉండడంతో ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రాలేదు. పట్టాలు అందుకున్న వారిలో చాలామందికి సొంత గృహాలు ఉండడంతో వారు జగనన్న కాలనీల్లోని ఇళ్ల స్థలాలను ఇతరులకు విక్రయిస్తున్నారు. కొంతమంది పేదలు మాత్రం ఇళ్లు కట్టుకోవడానికి డబ్బులు లేక పట్టాలను అమ్మేస్తున్నారు. అధికంగా టెక్కలి, మెళియాపుట్టి, పలాస, పాతపట్నం, నరసన్నపేట, కొత్తూరు, శ్రీకాకుళం, మందస తదితర ప్రాంతాల్లో జగనన్న ఇళ్ల పట్టాలను అమ్మకాలకు పెడుతున్నారు. ప్రాంతాన్ని బట్టి ఒక్కో ఇంటి పట్టాను రూ.3.లక్షల నుంచి రూ.4లక్షలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది రెవెన్యూ అధికారుల ద్వారా ఈ వ్యవహారం సాగిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు నిజమైన పట్టాదారులతో బాండ్‌పేపర్లపై సంతకాలు చేయించుకుంటున్నారు. ఇళ్ల నిర్మాణాలు అసలు పట్టాదారుడి పేరుపై జరుగు తున్నా.. వాటి యజమానులు మాత్రం వేరేవాళ్లు ఉంటున్నారు. టెక్కలిలో కొందరికి రెండు, మూడు పట్టాలు ఉన్నట్లు ఇటీవల అధికారుల విచారణలో తేలినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన రికార్డులను రెవెన్యూ అధికారులు మాయం చేసినట్లు తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

790 లేఅవుట్లు..

జిల్లాలో జగనన్న లేఅవుట్లు 790 ఉన్నాయి. 33,265 మందికి ఇళ్ల పట్టాలు అందించారు. సుమారు 11,364 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అధికంగా 1300 ఇళ్ల నిర్మాణం పూర్తికాగా, పాతపట్నం నియోజకవర్గంలో అత్యల్పంగా 400 ఇళ్ల నిర్మాణం జరిగింది. 20,951 వరకు వివిధ దశల్లో ఉన్నాయి. మరికొన్ని చోట్ల నిర్మాణాలే జరగడం లేదు. గతంలో జగనన్న కాలనీల్లో సీసీ రోడ్లు, కాలువలు, తాగునీటి కోసం రూ.8.74 కోట్లు మంజూరయ్యాయి. కాలువలకు రూ.1.47 కోట్లు, తాగునీటికి రూ.31.5 లక్షలు, సీసీ రోడ్లకు రూ.6.02 కోట్లు, అంతర్గతదారులకు రూ.30 లక్షలు, భూసేకరణకు రూ.13కోట్లు పైగా చెల్లించినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. కానీ, ఎక్కడా ఈ పనులు పూర్తి చేసిన పరిస్థితి లేదు. నిధులు మాత్రం ఖర్చయినట్లు లెక్కలు చూపించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

● కొందరు వైసీపీ నాయకులు తమ బంధువులకు అధికంగా పట్టాలు ఇప్పించుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. పలువురు రెవెన్యూ అధికారులు సైతం తమ వాళ్ల పేర్లతో పట్టాలు పొందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత (మిగతా 6వ పేజీలో..)



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

తుఫాన్ బాధితులందరికీ న్యాయం చేయాలి

- అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

కోటబొమ్మాళి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలి. కష్టకాలంలో ప్రభుత్వం తోడుగా నిలిచిందన్న సంతృప్తి రైతుల్లో కలిగేలా చర్యలు తీసుకోవాల'ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'అధికారులు ప్రతి గ్రామానికి వెళ్లి పంట నష్ట వివరాలు సమగ్ర ంగా నమోదు చేయాలి. పక్కాగా నివేదికలు రూపొందించాలి. నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నుంచి పరిహారం అందించాలి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలి. టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రహదారుల (మిగతా 6వ పేజీలో..)

బీఆర్‌ఏయూ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాల్లో నిర్వహించనున్న పలు పరీక్షలకు షెడ్యూల్‌ను వర్సిటీ అధికారులు మంగళవారం విడుదల చేశారు. 'డిసెంబరు 9 నుంచి జరగనున్న ఆర్ట్స్, సైన్స్, పీజీ కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలకు ఈ నెల 21వ తేదీలోగా ఫీజు చెల్లించాలి. వచ్చే నెల 3 నుంచి ప్రారంభం కానున్న బీటెక్ ఏడో సెమిస్టర్, ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్షలకు ఫీజు గడువు ఈ నెల 17. వచ్చే నెల 10 నుంచి ప్రారంభంకానున్న బీటెక్ 3,5 సెమిస్టర్ పరీక్షలకు ఫీజు ఈ నెల 24లోగా చెల్లించాలి. ఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్న బీఈడీ, స్పెషల్ బీఈడీ (ఎంఆర్) మూడో సెమిస్టర్‌లకు ఫీజు గడువు ఈ నెల 6తో ముగియనుంది. బీఈడీ మినహా మిగిలిన పరీక్షలన్నీ ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు జరుగుతాయి. బీఈడీ పరీక్షల టైంటేబుల్ వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామ'ని డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు.

- జిల్లావ్యాప్తంగా కార్తీకమాసం పిక్నిక్‌ల సందడి
- బీచ్‌ల్లో అప్రమత్తంగా ఉండాలని మెరైన్ హెచ్చరికలు
- పోలీసులు ఉన్నచోటే స్నానాలకు దిగాలని సూచన



పర్యాటకులూ.. జాగ్రత్త

● ఈ ఏడాది ఆగస్టు 6న సంతబొమ్మాళి మండలం భావనపాడు తీరంలో ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. దున్న దుర్యోధన, తిమ్మల జశ్వంత్, రాయల రాజేష్ సరదాగా భావనపాడు సముద్రంలో స్నానానికి దిగారు. అలల ఉధృతిలో కొట్టుకుపోయి.. ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు.

● అక్టోబరు 19న పొందూరు మండలం ఖాజీపేటకు చెందిన జగదీష్ అనే యువకుడు గార మండలం మొగదాలపాడు బీచ్‌లో గల్లంతయ్యాడు. పుట్టిన రోజు వేడుకలు చేసుకునేందుకు నలుగురు స్నేహితులతో కలిసి వెళ్లాడు. సముద్ర స్నానం చేస్తున్న సమయంలో జగదీష్ గల్లంతయ్యాడు. తరువాత రోజు మృతదేహం తీరం ఒడ్డుకు వచ్చింది.



కళింగపట్నం తీరంలో ప్రమాదాల కోసం వివరిస్తున్న మెరైన్ పోలీసులు

రణస్థలం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సముద్ర తీరంలో ప్రతి నెలా ఏదో ఒకచోట విషాదం చోటుచేసుకుంటూనే ఉంటుంది. ప్రస్తుతం కార్తీక మాసం వేళ.. నిత్యం సముద్ర తీర ప్రాంతాల్లో భక్తుల కోలాహలం కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళలు తీర ప్రాంతాల్లో పూజలు చేస్తుంటారు. ఆపై పిక్నిక్‌ల సందడి కూడా మొదలైంది. దీంతో యువత ఆనందానికి అవధులు లేవు. అయితే ఆనందం మాటున ప్రమాదాలు పొంచి ఉంటాయి. గత అనుభవాల దృష్ట్యా యువత అప్రమత్తంగా ఉండకపోతే మూల్యం తప్పదు. అందుకే సముద్ర స్నానాల విషయంలో జిల్లా మెరైన్ పోలీసులు గట్టి హెచ్చరికలు చేస్తున్నారు. సముద్రస్నానాలంటూ ఎక్కడిపడితే అక్కడ దిగితే చర్యలు తప్పవంటున్నారు.

● 18 చోట్ల స్నానాలు..

జిల్లాలోని 11 మండలాల్లో 193 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. 18చోట్ల సముద్రస్నానాలు చేసేందుకు అనుకూలం. కానీ ఎక్కడపడితే అక్కడ యువత సముద్ర స్నానాలకు దిగి ప్రమాదాల బారిన పడుతున్నారు. జిల్లాలో కళింగపట్నం, భావనపాడు, అక్కుపల్లి శివసాగర్ బీచ్, బారువ బీచ్, డొంకూరు తీరానికి ఎక్కువగా పర్యాటకులు తరలివస్తుంటారు. కార్తీక మాసం నుంచి సంక్రాంతి వరకూ పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. సముద్రతీరంలో అలల ఉధృతికి కొంత మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. అందుకే గుర్తింపు, ఆపై మెరైన్ పోలీసులు అందుబాటులో ఉన్నచోట మాత్రమే సముద్రస్నానాలకు దిగితే మంచిది. ముఖ్యంగా పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి. పిల్లలను ఒంటరిగా పిక్నిక్‌కు పంపించడం చాలా ప్రమాదం. మరోవైపు ఇటీవల కురిసిన వర్షాలకు నదుల్లో నీటి ప్రవాహం కూడా పెరిగింది. నదీ తీర ప్రాంతాల్లో ఈత కూడా ఇబ్బందికరమేనని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

● అరకొరగా సిబ్బంది..

రణస్థలం మండలం దోనిపేట నుంచి ఇచ్ఛాపురం మండలం డొంకూరు వరకూ 193 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. ఈ తీర ప్రాంత పరిరక్షణ మెరైన్ పోలీసుల బాధ్యత. కానీ జిల్లాలో కేవలం భావనపాడు, కళింగపట్నం, బారువలో మాత్రమే మెరైన్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. సిబ్బంది అరకొరగానే ఉన్నారు. ఒక్కో మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, ముగ్గురు ఏఎస్‌ఐలతో పాటు ఇతర సిబ్బంది 40 మంది వరకూ ఉండాలి. కానీ ఏ స్టేషన్‌లోనూ పది మంది సిబ్బంది కూడా లేరు. తీరంలో గస్తీ కోసం ఎటువంటి పరికరాలు, యంత్రాలు లేవు. వాస్తవానికి తీరంలోని (మిగతా 6వ పేజీలో..)

సమాచారం

నేడు జిల్లా సమీక్షా సమావేశం

కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10గంటలకు రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ప్రవాస భారతీయుల సాధికారిత సంబంధాల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామన్నారు.

11న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం మండలం మునసబుపేటలోని గురజాడ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆడిటోరియంలో ఈ నెల 11న యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సెట్‌శ్రీ సీఈవో వీవీ అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. '15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయసు గల యువతీ యువకులకు వివిధ పోటీలు నిర్వహిస్తారు. జానపద బృంద నృత్యం (10మంది) 15 నిమిషాలకు మించకుండా, జానపద బృంద గీతాలు (10మంది) 7 నిమిషాల పాటు నిడివి ఉండాలి. సినిమా పాటలు, సీడీలు, క్యాసెట్లు అనుమ తించబడవు. లైవ్ ఆర్కెస్ట్రా ఏర్పాటు చేసుకోవాలి. సొంత ఖర్చులతో పోటీలకు హాజరుకావాలి. భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించిన విషయాల పైనే ప్రదర్శనలు ఇవ్వాలి. చిత్రలేఖనం, కవిత్వం, స్టోరీ రైటింగ్, డిక్లమేషన్ అంశాల్లో కూడా పోటీలు ఉంటా యి. జిల్లా స్థాయి విజేతలకు రాష్ట్ర స్థాయి పోటీలు, రాష్ట్ర స్థాయి విజేతలకు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. మరిన్ని వివరాలకు 97041 14705 నెంబరులో సంప్రదించాల'ని సెట్‌శ్రీ సీఈవో అప్పలనాయుడు కోరారు.

పుణ్యక్షేత్రాల్లో రద్దీ నియంత్రణకు చర్యలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అరసవల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రధాన దేవాలయాలు, పుణ్యక్షేత్రాల్లో భక్తుల రద్దీని నియంత్రించేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'కార్తీక సోమవారాలు, పౌర్ణమి వంటి పర్వదినాల్లో భక్తుల సంఖ్య పెరుగుతున్నందున క్యూలైన్లు, ప్రసాదం కౌంటర్లు, పార్కింగ్ నిర్వహణ విషయంలో ఎక్కడా లోటు లేకుండా పక్కా ఏర్పాట్లు చేయాలి. జిల్లాలో మతపరమైన, లౌకిక కార్యక్రమాలతో పాటు శివాలయాలు, నదీ తీరాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా రక్షణ కల్పించాలి. ఆలయాలు, పుణ్యస్నానాల ఘాట్ల వద్ద రద్దీ నియంత్రణకు చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ, ప్రైవేటు అంబులెన్స్‌ల పూర్తి జాబితాను, ఫోన్ నెంబర్లతో సహా తయారు చేసి అత్యవసర సమయాల్లో వినియోగించేందుకు సిద్ధంగా ఉంచుకోవాలి. పుణ్యస్నానాలు, దీపారాధనలు చేసే భక్తులకు ఇబ్బందులు లేకుండా పోలీసులు, ఆలయ కార్యనిర్వహణాధికారులు, స్థానిక సంస్థలు సమన్వయంతో పని చేయాల'ని ఆదేశించారు. అలాగే ధాన్యం కొనుగోలు ప్రక్రియ, పారిశుధ్య నిర్వహణ, శాంతిభద్రతలు, ప్రభుత్వ పథకాలు అమలుపై కలెక్టర్ సమీక్షించారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌వీ లక్ష్మణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల ఎంపీపీగా జరుగుళ్ల విజయకుమారి



ఎచ్చెర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు-2 జరుగుళ్ల విజయకుమారిని ఎంపీపీగా నియమిస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎంపీపీగా ఉన్న మొదలవలస చిరంజీవి పీడీ యాక్ట్‌లో అరెస్ట్ అయి విశాఖపట్నం సెంట్రల్ జైలులో ఉన్నారు. దీంతో విజయకుమారికి ఈ బాధ్యతలు అప్పగించారు. మండల పరిషత్ అధ్యక్షులు చేపట్టాల్సిన కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండేలా కలెక్టర్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

తొమ్మిది మంది డిశ్చార్జ

- ఆస్పత్రిలో మరో ఇద్దరికి చికిత్స

పలాస, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాటలో గాయపడిన క్షతగాత్రులు కోలుకుంటున్నారు. పలాసలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 11 మంది బాధితులు చేరగా.. మంగళవారం 9 మందిని డిశ్చార్జ్ చేశారు. మరో ఇద్దరు మహిళలు చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తమ్మినేని పాపినాయుడు, డాక్టర్ కూన మోహన్‌బాబు ఆధ్వర్యంలో క్షతగాత్రులకు చికిత్స అందజేస్తున్నారు. బి.పుష్పలత, పిన్నింటి నాగమ్మ, రేగుల హరికృష్ణ, గున్న చిట్టెమ్మ, పిన్నింటి సూరమ్మ, పిన్నింటి గౌరి, దుంప భారతి, టొంపల వెంకమ్మ, దట్టి అడ్డమ్మను డిశ్చార్జ్ చేశామని వైద్యాధికారులు తెలిపారు. వారు పూర్తిగా కోలుకునేందుకు ఆరువారాలు సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ఇంటి వద్దే ఉంటూ మందులు వేసుకోవాలని వారికి సూచించారు. అలాగే ప్రస్తుతం రమాదేవి, డి.కాంతమ్మ చికిత్స పొందుతున్నారని తెలిపారు.



కోలుకున్నవారిని అంబులెన్స్‌లో ఇళ్లకు పంపిస్తున్న వైద్యాధికారులు

ఎవరా మహిళలు?

- అపరిచితుల సంచారం.. ఇద్దరు పరారీ
- ముగ్గురిని పట్టుకుని పోలీసులకు అప్పగింత



మహిళలను నిలదీస్తున్న గ్రామస్థులు



జి.సిగడాం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జి.సిగడాంలో మంగళవారం సాయంత్రం ఐదుగురు గుర్తుతెలియని మహిళలు సంచరించడంతో గ్రామస్థులు ఆందోళన చెందారు. స్థానిక సత్యసాయి విద్యామందిర్ వెనుక ఐదుగురు అపరిచిత మహిళలు అనుమానాస్పదంగా తిరుగుతూ ప్రిన్సిపాల్‌కు కనిపించారు. వారిని 'మీరెవరు.. ఎక్కడి నుంచి వచ్చారు. ఇక్కడ ఎందుకు తిరుగుతున్నార'ని ప్రిన్సిపాల్, స్థానికులు ప్రశ్నించగా ఆ మహిళలు పరుగులు తీశారు. స్థానికులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా ఇద్దరు మహిళలు పరారయ్యారు. ముగ్గురు పట్టుబడ్డారు. వారిని పోలీసులకు అప్పగించారు. వారికి సంబంధించిన వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

భవనాలు భద్రం.. సమస్యలు పదిలం

- ప్రారంభానికి నోచుకోని సచివాలయాలు
- పాత కార్యాలయాల్లోనే నిర్వహణ

6లో

మా భూముల్లో ఎయిర్‌పోర్టు వద్దు

- రీసర్వే చేయడంపై ఆర్డీవోను నిలదీసిన రైతులు

6లో

'కార్తీక మాసంతో సమానమైన మాసం లేదు' అని పురాణాలు చెబుతున్నాయి. అటువంటి కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమికీ అంతే ప్రాధాన్యం ఉంది. ఆ రోజున హిందువులు కేదారేశ్వర వ్రతాలు ఆచరిస్తారు. శివాలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేస్తారు. ఈమేరకు శైవక్షేత్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.

- నేడు కార్తీక పౌర్ణమి
- హిందువులకు అత్యంత విశిష్టమైన పర్వదినం
- ఆలయాల్లో పూజలు... నదుల్లో దీపారాధన
- శివకేశవులకు ప్రీతికరమైన రోజు

కేదారేశ్వరుని పూజకు వేళాయే



నరసన్నపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): హిందువులు అత్యంత పవిత్రంగా భావించే పండుగలలో కార్తీక పౌర్ణమి ఒకటి. కార్తీక మాసం శివకేశవులకు ప్రీతికరమైనదిగా పండితులు చెబుతారు. ఈ మాసంలో వచ్చే పండుగల్లో అత్యంత వైభవంగా జరుపుకునేది కార్తీక పౌర్ణమి. కార్తీక పౌర్ణమిని త్రిపుర పూర్ణిమ అని కూడా అంటారు. త్రిపురాసురులు అనే రాక్షసులు నిర్మించిన మూడు కొత్త గ్రహాలను (త్రిపురాలు) శివుడు ఒకేసారి తన త్రిశూలంతో అంతమొందించిన రోజు. అందుకు త్రిపుర పూర్ణిమ అని పిలుస్తారు. విజయానికి సంకేతంగా అనేక ప్రదేశాల్లో ఉత్సవాలు నిర్వహిస్తారు

మానవాళిని రక్షించిన రోజుగా..

శ్రీ మహావిష్ణువు మత్స్యావతారంలో మానవాళిని, వేదాలను ప్రళయం నుంచి రక్షించిన రోజు కూడా ఇదేనని నమ్మకం. ఈ పవిత్రమైన రోజున సకల దేవతలు భూమిపైకి వస్తారని... ఈ రోజు చేసే స్నానాలు, దానధర్మాల వల్ల సకల పాపాలు హరించి.. మోక్షం లభిస్తుందని భక్తుల ప్రగాడ విశ్వాసం. కార్తీక పౌర్ణమి సందర్భంగా సముద్రం, నదులు, లేదా పవిత్రజలాల్లో స్నానం చేయడం అత్యంత పుణ్యప్రదం. ఇది మహాశివరాత్రితో సమానమైన ఫలితాన్ని ఇస్తుందని హిందువుల విశ్వాసం.

దీపారాధన..

కార్తీక మాసంలోనూ...అందులోనూ కార్తీక పౌర్ణమి రోజున దీపారాధనకు విశేష ప్రాధాన్యం ఉంది. ఈ ఒక్కరోజు 365 వత్తులతో కూడిన దీపాన్ని వెలిగిస్తారు. ఇది సంవత్సరంలో ప్రతి రోజూ దీపం వెలిగించిన పుణ్యాన్ని ఇస్తుందని విశ్వాసం. అరటి పువ్వులు, దొన్నెలలో దీపాలను వెలగించి.. నదులు, చెరువుల్లో వదులుతారు. దీని వ ల్ల అష్టైశ్వర్యాలు కలుగుతాయని నమ్మకం. ఉసిరి చెట్టు వద్ద, లేదా శివాలయంలో దీపాలను వెలిగించడం శుభప్రదమని పండితులు చెబుతారు.

జ్వాలా తోరణం..

కార్తీక పౌర్ణమి రోజున శివాలయాల్లో జ్వాలా తోరణం కింద నడవడం ద్వారా సర్వపాపాలు తొలగి నరక ద్వారం నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం. అలాగే కేదారేశ్వర వ్రతం, సత్యనారాయణ స్వామి వ్రతాలు చేస్తారు. భక్తులు ఉపవాస దీక్షతో ఉంటూ... శివకేశవులను పూజిస్తారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాల్లో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకాకుళం పట్టణంలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి, శ్రీముఖలింగేశ్వర, ఎండల మల్లికార్జున స్వామి తదితర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, దీపారాధన చేయనున్నారు. నదులు, చెరువుల్లో అరటి దవ్వపై దీపాలు వెలిగించి... విడిచిపెడతారు. శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో రెండేళ్లుగా కార్తీక పౌర్ణమి రోజున బాలి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇటీవల కాశీబుగ్గలో జరిగిన సంఘటన నేపథ్యంలో ఎటువంటి దుర్ఘటనలు చోటుచేసుకోకుండా ఆలయ కమిటీలకు పోలీసులు భద్రతపరమైన సూచనలు ఇచ్చారు. ఆ మేరకు భక్తుల దర్శనాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వేయి దీపాలతో శివలింగాకృతి



సరుబుజ్జిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి జంక్షన్‌లో ఉన్న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి దీపాలతో ప్రత్యేకంగా శివలింగాకృతిని ఏర్పాటు చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని వేయి దీపాలను శివలింగాకృతిలో వెలిగించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటేష్

మా భూముల్లో ఎయిర్‌పోర్టు వద్దు

- రీసర్వే చేయడంపై ఆర్డీవోను నిలదీసిన రైతులు

హరిపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'మా జీవనానికి ఈ భూమే ఆధారం. పచ్చని చెట్ల మధ్య కార్గో ఎయిర్‌పోర్టును నిర్మించవద్దు' అని పలు గ్రామాల రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మందస మండలం గంగువాడ, రాంపురం పరిసర ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన కార్గో ఎయిర్‌పోర్టుకు సంబంధించి అధికారులు మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. బిడిమి గ్రామంలోని సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ తదితరులు ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. రైతులు దున్న హరికృష్ణ, జుత్తు గున్నయ్య, కుమారి, రెల్ల ఆనంద్ తదితరులు మాట్లాడుతూ.. తమ అనుమతి లేకుండా రీ సర్వే పేరుతో ఎయిర్‌పోర్టు కోసం తమ భూములను కొలవటం ఏంటని నిలదీశారు. ఇక్కడే ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తామని అధికారులు, మంత్రులు రోజుకో ప్రకటన చేయడంతో తమ గ్రామాల్లో మరింత భయాందోళనలు నెలకొన్నాయన్నారు. అధికారులను నిలదీయటంతో కాసేపు సభ రసాభాసగా మారింది. ఎస్ఐ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో భద్రత ఏర్పాటు చేసిన అనంతరం ఆర్డీవో వెంకటేష్ మాట్లాడారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ప్రజలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తామని చెప్పారు. ప్రభుత్వానికి సమస్యలను నివేదించి పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు. ఆర్ఐ ఇందిర, సర్వేయర్ బాబూరావు, రైతుల ప్రతినిధులు ఎం.నాగరత్నం, జుత్తు కూర్మారావు, అమ్మినాయుడు, లోకనాథం, మోహన్, చలపతి పాల్గొన్నారు.

పర్యాటకులూ.. జాగ్రత్త

(ఐదో పేజీ తరువాయి)

మూడు కిలోమీటర్ల వరకూ మెరైన్ పోలీసులే గస్తీ కాయాలి. కానీ వారు తీరానికే పరిమితమైపోతున్నారు. ఆధునిక బైనాక్యులర్లు లేవు. తీరంలో వెళ్లేందుకు, పర్యవేక్షించేందుకు బోట్లు సైతం లేవు. అందుకే ఈ ఏడాది మెరైన్ పోలీస్ యంత్రాంగం ముందే మేల్కొంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న తీర ప్రాంతాల్లో మెరైన్ పోలీసులు అందుబాటులో ఉన్నచోట మాత్రమే సముద్ర స్నానాలు చేయాలని ఆదేశాలు జారీచేసింది.

- **డీఐజీ ఆదేశాలతో..**

మెరైన్ పోలీసులు అందుబాటులో ఉన్నచోట మాత్రమే సముద్ర స్నానాలు చేయాలి. ఈ విషయంలో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలి. తల్లిదండ్రులు కూడా జాగ్రత్తలు పాటిస్తూ పిల్లల కదలికలపై దృష్టి సారించాలి.

-ప్రసాదరావు, సీఐ,
మెరైన్ పోలీస్‌స్టేషన్, కళింగపట్నం

నిబంధనలు పాటించండి..

నరసన్నపేట, పోలాకి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమి నేపథ్యంలో సముద్ర స్నానాలకు ఎటువంటి అనుమతి లేదని సీఐ ఎం.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మంగళవారం పోలాకి మండలం రాజారాంపురం సముద్రతీర ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. పిక్నిక్‌ల పేరిట పర్యాటకులు సముద్రంలో స్నానానికి దిగేందుకు అనుమతి లేదన్నారు. అలాగే దేవాలయాలు వద్ద ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను భక్తులు పాటించి భద్రతా చర్యలకు సహకరించాలని సూచించారు.



పోలాకి: రాజారాంపురం బీచ్ వద్ద స్థానికులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు



దీపారాధనలో పాల్గొన్న భక్తులు

జ్యోతిర్లింగ దీపారాధన

నందిగాం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందిగాంలో కొలువై ఉన్న నీలమణిదుర్గ (పాతపట్నం అమ్మవారు) ఆలయంలో కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకొని జ్యోతిర్లింగ దీపారాధనను మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు ఎం.రమేష్‌శర్మ పర్యవేక్షణలో విశేష పూజలు నిర్వహించి.. ఓంకారం, శివలింగం తదితర ఆకృతులలో దీపాలంకరణ చేశారు. ఈ దీపాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఒక్కోటి రూ.4 లక్షలు

(ఐదో పేజీ తరువాయి)

జగనన్న ఇళ్ల పట్టాలపై విచారణ చేస్తామని హడావుడి చేసి వదిలేసింది. దీంతో గతంలో పట్టాలు పొందిన కొంతమంది వైసీపీ నాయకులు వాటిని అమ్ముకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

మా దృష్టికి రాలేదు..

జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల పట్టాలు పొంది ఇప్పటివరకు నిర్మాణం చేపట్టని వారి వివరాలు సేకరిస్తాం. అటువంటి లబ్ధిదారుల పట్టాలను రద్దు చేసి, ఇళ్లు లేని వారికి వాటిని అందజేస్తాం. ఇళ్ల పట్టాలు అమ్మకాలు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు.

-పాపారావు, తహసీల్దార్, మెళియాపుట్టి

ఘనంగా తాటిపోలమ్మ ఆలయ వార్షికోత్సవం



నందిగాం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పెంటూరు వాసుల గ్రామదేవత తాటిపోలమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు రేజేటి బోసుబాబు, మేడేపల్లి రమేష్‌శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు, కుంకుమార్చనలు, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ముగ్రాటలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి... తాటిపోలమ్మతో పాటు నీలమణిదుర్గ, చింతపోలమ్మ గ్రామదేవతలకు చల్లదనం చేశారు.

అమ్మవార్ల గజముద్దలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ

- జిల్లా వ్యాప్తంగా బాలికలకు శిక్షణ

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవలసిన అవసరం ప్రస్తుత తరుణంలో ఎంతో అవసర మని సమగ్ర శిక్ష ఏపీసీ డా.ఎస్.శశిభూషణరావు అన్నారు. బాలికలు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొంద డం ద్వారా అనుకోని ఆపదలు ఎదురైనపుడు స్వీయ రక్షణ పొందవచ్చునన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళ వారం సాయంత్రం 'రాణీ లక్ష్మీభాయి ఆత్మరక్షణ-స్వీయ రక్షణ శిక్షణ' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లోని బాలికలకు ఆత్మరక్షణ కోసం శిక్షణను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అందులో భాగంగా జిల్లాలో ని 382 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బాలికలకు ఆత్మరక్షణ విద్యలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ వ్యవస్థాపకులు ఎస్.లక్ష్మీ సామ్రాజ్యం, డైరెక్టర్ వి.రవి, జిల్లా కో ఆర్డినేటర్ తైక్వాండో శ్రీను, హెచ్ఎం వి.సుజాత, పీఈటీలు భవాని, అరుణ, శాప్ కోచ్ లక్ష్మణ్, మణి, తైక్వాండో కోచ్‌లు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

తుఫాన్ బాధితులందరికీ న్యాయం చేయాలి

(ఐదో పేజీ తరువాయి)

నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదు. దీనిపై పర్యవేక్షణ అధికారులే పూర్తి బాధ్యత వహించాల'ని స్పష్టం చేశారు. అలాగే వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భవనాలు భద్రం.. సమస్యలు పదిలం



అద్దె ఇంటిలో మామిడిపల్లి సచివాలయం

- ప్రారంభానికి నోచుకోని సచివాలయాలు
- పాత కార్యాలయాల్లోనే సిబ్బంది విధులు
- అధిక శాతం అద్దె భవనాల్లోనే...
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది

సోంపేట రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి తెస్తామని చెబుతూ వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. కొన్ని చోట్ల సచివాలయాలకు సొంత భవనాలు నిర్మించారు. కానీ మండలంలోని అనేక పంచాయతీల్లో సొంత భవనాలు లేక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 23 పంచాయతీలకు కేవలం 8 చోట్ల మాత్రమే ప్రభుత్వం భవనాలు నిర్మించింది. మరో 15 చోట్ల భవనాలు లేకపోవడంతో దశాబాల క్రితం నిర్మించిన పంచాయతీ భవనాల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వాటిలోనూ సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ఆరేళ్లు దాటినా..

పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్‌తో పాటు రోజువారీ కార్యకలాపాలు నిర్వహించే సిబ్బందికి అన్ని వసతులతో కూడిన భవనలు నిర్మిస్తామని అప్పటి వైసీపీ నాయకులు ప్రకటించారు. కానీ అవి ముందుకు వెళ్లలేదు. దీంతో ఆరేళ్లు దాటినా 50 శాతం భవనాలు కూడా పూర్తి కాలేదు. సిరిమామిడి, గొల్లపూరు, బారువ పంచాయతీల్లో భవన నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. కొన్ని చోట్ల స్థానికంగా ఉన్న కాంట్రాక్టర్లు నాసిరకం పనులు చేయడం వల్ల బిల్లులు నిలిపివేశారు. వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తూ అటు ప్రజలకు, ఇటు సిబ్బందికి ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సచివాలయాల్లో వసతులు లేకపోవడంతో మహిళా సిబ్బంది తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. కంప్యూటర్లు, ఇతర పరికరాలు ఉంచడానికి గదులు లేక ఉద్యోగులతో పాటు పనులు కోసం వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు.

నాణ్యతా లోపంతో..

నిర్మాణాల్లో నాణ్యతా లోపాల వల్ల కాంట్రాక్టర్లకు కొన్ని చోట్ల బిల్లులు చెల్లించలేదని తెలుస్తోంది. పనులు పూర్తయి ముస్తాబైన సచివాలయాలు కూడా ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీనిపై సోంపేట ఎంపీడీవో ఈశ్వరమ్మను వివరణ కోరగా నిర్మాణాలు పూర్తి చేయానికి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.



సిరిమామిడిలో ప్రారంభానికి నోచుకోని భవనాలు

ఢిల్లీ సైన్స్ ఎగ్జిబిషన్‌కు దీపక్


దీపక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వైకుంఠరావు

ఇచ్ఛాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న సైన్స్ ఎగ్జిబిషన్‌కు పురుషోత్తపుం ఆదర్శ పాఠశాల విద్యార్థి పాండవ దీపక్ కుమార్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డి.వైకుంఠరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం దీపక్ కుమార్ ఢిల్లీకి పయనం అయ్యాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఎగ్జిబిషన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 52 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వారిలో దీపక్‌కు స్థానం లభించడం ఆనందంగా ఉందన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేతలకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వర్మ

ఆమదాలవలస, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా రవీంద్ర పాడు హైస్కూల్ మైదానంలో ఇటీ వల జరిగిన వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో తొగరాం జూనియర్ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వారిని మంగళవారం ప్రిన్సిపాల్ వర్మ అభినందించారు. అండర్-17 విభాగం 69 కేటగిరీలో మాధురి, స్నాచ్ అండ్ క్లీనర్ జర్క్ విభాగంలో 160 కేజీల బరువును ఎత్తి మురళి విజేత లుగా నిలిచి బంగారు పతకాలు సాధించారన్నారు. అలాగే అండర్-19 విభాగంలో సంపద రావు కిరణ్ స్నాచ్ అండ్ క్లీన్ అండ్ జర్క్ విభాగంలో 120 కేజీల బరువు ఎత్తి ద్వితీయ స్థానం పొంది, రజత పతకం సాధించాడన్నారు. కళాశాల విద్యార్థులు పతకాలు సాధించడంపై ప్రిన్సిపాల్, అధ్యాపకులు హర్షం వ్యక్తంచేశారు.

పేదల కోసమే సీఎంఆర్ఎఫ్: శంకర్


సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పేదల కోసమే సీఎం సహాయనిధి అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురికి స్థానిక విశాఖ-ఏ కాలనీ కార్యాలయంలో మంగళవారం సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుం బాలకు, నిరుపేదలకు అత్యవసర వైద్య చికిత్సలో సాయం అందించడమే లక్ష్యమన్నారు. 39 నిరుపేద కుటుంబాలకు మొత్తం రూ.28,14,505 చెక్కులను అందించారు.

సెమీస్‌కు శ్రీకాకుళం జట్టు


తూర్పుగోదావరి, కృష్ణా జట్ల మధ్య పోటీ

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం శ్రీకాకుళం జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది. క్వార్టర్ ఫైనల్‌లో కృష్ణా జిల్లా జట్టుపై 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. లీగ్ కమ్ నాకౌట్ విధానంలో నిర్వ హిస్తున్న ఈ టోర్నమెంట్‌లో నాలుగు పూల్స్‌లో రన్నర్, విన్నర్లను క్వార్టర్ ఫైనల్స్‌కు అనుమతించారు. దాంతో శ్రీకాకుళం, కృష్ణా, పశ్చిమ గోదావరి, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం, చిత్తూరు, తూర్పు గోదావరి జిల్లాల జట్లు క్వార్టర్స్‌కు చేరుకున్నాయి. తొలి క్వార్టర్‌లో కృష్ణాపై శ్రీకాకుళం విజయం సాధించగా, తర్వాత గుంటూరుపై పశ్చిమగోదావరి గెలిచి సెమీ ఫైనల్‌కు చేరుకుంది. తూర్పుగోదావరి, చిత్తూరు మధ్య జరిగిన మ్యాచ్‌లో స్కోర్లు సమం కావడంతో సూపర్ ఓవర్ నిర్వహించారు. ఇక్కడ కూడా స్కోర్లు సమం కావడం, లైట్ ఫెయిల్యూర్ అవడంతో మ్యాచ్‌ను బుధవా రం ఉదయానికి వాయిదా వేశారు. విజయ నగరం, విశాఖపట్నం మధ్య పోటీ బుధవారం నిర్వహించనున్నారు. జిల్లాలోని కోడిరామ్మూర్తి స్టేడియంతోపాటు ఆర్ట్స్ కళాశాల మైదానం, చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల మైదానం, వేంకటేశ్వర ఇంజినీరింగ్, అంబేడ్కర్ వర్సిటీల్లో ఈ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నారు.

ఒడిశా గవర్నర్‌కు వేద ఆశీర్వాదం


గవర్నర్ హరిబాబుకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న స్వామి

ఇచ్ఛాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒడిశా పర్యటనలో భాగంగా శ్రీవారాహి నైమిషారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు ఆహ్వానం మేరకు మంగళవారం ఆయన ను కలిశారు. భువనేశ్వర్‌లోని రాజభవన్‌లో గవర్నర్‌ను కలిసి వేదాశీ ర్వచనం చేసి వారాహి అమ్మవారి చిత్రపటం బహూకరించారు. ఈ సంద ర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా హోమాలు చేయాలని కోరారు.

బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖరరావు


రాజశేఖరరావు

ఎచ్చెర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఇంజనీ రింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతాడ రాజశేఖరరావు ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ ప్రతినిధి పి.రామచంద్రరావు పర్యవేక్షణలో ఇటీవల నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. పొందూరు మండలం గోకర్ణ పల్లికి చెందిన ఈయన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఏపీ రాష్ట్ర శాఖకు డివిజనల్ కోఆర్డినేటర్‌గా, మూడు అటానమస్ కళాశాలలకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా ఉన్నారు. ఈయన ఎన్నికపై పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తంచేసి అభినందించారు.

గిరి ప్రదక్షిణకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి
- ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ, ఆర్డీవో


మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

జి.సిగడాం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎందువ కైలాశేశ్వర గిరి ప్రదక్షిణ బుధవారం నిర్వహించనున్న నేపథ్యంలో భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకుని వారికి ఎటువంటి ఇబ్బం దులు లేకుండా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఆర్డీవో సాయి ప్రత్యూష సూచించారు. మంగళవారం గిరి ప్రదక్షిణ కొండ పరిసరాలను వారు వేర్వేరుగా పరిశీలించారు. అనంతరం నిర్వాహకులతో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గిరి ప్రదక్షిణకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులను కోరారు. కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో గిరి ప్రదక్షిణ సమయంలో ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

- ఆర్డీవో సాయి ప్రత్యూష మాట్లాడుతూ.. గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ శాఖ నుంచి సిబ్బందిని నియమిస్తున్నా మన్నారు. గిరి ప్రదక్షిణ, పరమేశ్వరుని దర్శించుకున్న భక్తులకు మార్గమధ్యంలో తాగునీరు, స్నాక్స్ అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, ఎస్ఐ వై.మధుసూదన రావు, తహసీల్దార్ ఎం.సరిత, ఎంపీడీవో జి.రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, సర్పంచ్ అల్లు జోగి నాయుడు, గొలివి శ్రీనివాసరావు, నేతేటి రామకృష్ణ శర్మ, పలువురు నిర్వాహకులు పాల్గొన్నారు.

చేయి చేయి కలిపి..

- మైదానాన్ని శుభ్రం చేసిన క్రీడాకారులు

ఇచ్ఛాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని సురంగి రాజా క్రీడా మైదానంలో మురుగునీరు నిలిచి దారుణంగా తయారైంది. ఈ నేపథ్యంలో క్రీడాకారులంతా కలిసి మంగళవారం శ్రమదానం చేసి చెత్తను తొలగించి శుభ్రం చేశారు. దీంతో పలువురు పట్టణ వాసులు, క్రీడాకారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.


మైదానాన్ని శుభ్రపరుస్తున్న క్రీడాకారులు

ఆమె నేత్రాలు సజీవం


ఇందిర(ఫైల్)

అరసవల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అరసవల్లికి చెందిన మాడుగుల ఇందిర (36) మంగళవారం మృతి చెందారు. ఆమె నేత్రాలను దానం చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణ యించి రెడ్‌క్రాస్ ప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్లు పి. సుజాత, చిన్నికృష్ణ కార్నియాలను సేకరించి విశాఖ పట్నం ఎల్‌వీప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి తరలించారు. మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపి ఇందిర వారిలో సజీవంగా ఉంటారని రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు అన్నారు. నేత్రదానం చేయాలనుకునే వారు 78426 99321 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

సోంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన ఘటనలో మృతిచెందిన నిఖిల్ కుటుంబాన్ని జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమెతో పాటు ఎంపీపీ నిమ్మన దాసు, తామాడ పద్మావతి, పోకల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రభుత్వం చర్యలు

లావేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దీనికోసం ప్రవేశపెట్టిన నారీశక్తి యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత అన్నారు. మంగళవారం తాళ్లవలసలో నారీశక్తి యాప్ పై పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు చట్టాలు అమలు చేస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, హెచ్‌సీ ఉషారాణి, పీసీ అనసూయ, పలువురు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

నారీశక్తిపై అవగాహన

గార, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కళింగపట్నం పంచాయతీ సిలగాం గ్రామంలో మంగళవారం ఎస్ఐ సీహెచ్ గంగరాజు స్థానికు లకు నారీ శక్తిపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్, టోల్ ఫ్రీ నెంబర్, శక్తియాప్, మహిళా రక్షణ చట్టాలను వివరించారు. కార్య క్రమంలో స్థానిక పెద్దలతో పాటు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

కవిటి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో వరదనీటితో ముంపునకు గురైన పంట పొలాల్లో తెగుళ్ల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డి.ఉదయ్‌కుమార్, భాగ్యలక్ష్మి సూచించారు. పి.కొజ్జిరియా ప్రాంతంలో మంగళవారం పర్యటించి పంటలను పరిశీలించారు. పొడతెగులు, ఆకుముడత తెగుళ్ల సోకనట్లు గుర్తిచామన్నారు. వరదనీటిని తొలగించి హెగ్జాకోనాజోల్ రెండు మి.లీ., అసిపేట్ 1.5 గ్రాముల మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మందుల వాడకంతో పంటకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా దిగుబడికి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. వారితో పాటు ఏడీఏ టి.భవానీశంకర్, ఏవో పి.శ్రీదేవి తదితరులున్నారు.


పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

దారుణంగా ఓపీ అగ్రహారం రోడ్డు

ఎచ్చెర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భగీరథపురం పంచాయతీ ఓపీ అగ్రహారం రోడ్డు దారుణంగా ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోతుల్లో నీరు చేసి మరింత అధ్వానంగా తయారైంది. రోడ్డు దుస్థితిని అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలువురు స్థానికులు కోరు తున్నారు.


అధ్వానంగా ఉన్న ఓపీ అగ్రహారం రోడ్డు

మొక్కల పెంపకం చేపట్టాలి

రణస్థలం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పైడిభీమవరం పారిశ్రామికవాడలో విరివిగా మొక్కల పెంపకం చేపట్టాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.మురళీమోహన్ అన్నారు. పారిశ్రామిక పార్క్‌లో ఇండస్ట్రీస్ పార్టనర్ షిప్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం మొక్కలు నాటారు. పార్క్ పరిధిలో కాలువల శుభ్రత, పచ్చదనం, రోడ్ల మరమ్మతులు, మౌలిక వసతుల ఆధునికీకరణ తదితర పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణకు, పరిసరాల పరిశుభ్రతకు పారిశ్రామికవేత్తలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నోడల్ అధికారి బీవీ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పారిశ్రామిక వాడలో మొక్క నాటి నీరు పోస్తున్న దృశ్యం

కూచిపూడిలో శ్రీలత నృత్య ప్రదర్శన



ఆమదాలవలస, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలో ఉన్న కూచిపూడి అగ్రహారంలో ఆమదాలవలసకు చెందిన కూన శ్రీలత చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సిద్ధేంద్రయోగి కళావేదికపై సోమవారం శ్రీలత వివిధ భక్తి గీతాలకు నృత్యాభినయం చేసి ఆహూతుల ప్రశంసలు అందుకున్నారు. ప్రముఖ నాట్యాచార్యులు, కళారత్న డాక్టర్ చింతా రవి, బాలకృష్ణ నృత్య దర్శ కత్వంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమెను ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు చాగంటి కోటేశ్వరరావు జ్ఞాపిక అందించి అభినందించారు.

శ్రీలతకు జ్ఞాపిక అందించి అభినందిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు


దుకాణదారులను హెచ్చరిస్తున్న సీఐ

శ్రీకాకుళం క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రహదారికి ఇరువైపులా ఆక్రమణలు చేపడితే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ నాగరాజు హెచ్చరించారు. నగరంలోని పొట్టి శ్రీరాములు జంక్షన్ నుంచి ఏడు రోడ్ల జంక్షన్ వరకు ఫుట్‌పాత్, రోడ్లపై ఏర్పాటు చేసిన పలు దుకాణాలను నగర పాలక సంస్థ సిబ్బందితో కలిసి మంగళవారం తొలగించారు. ఫుట్ పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలకు సంబంధించిన బోర్డులను, వస్తువులను వాహనంలోకి ఎక్కించారు. ఆయన మాట్లాడుతూ.. ఫుట్‌పాత్‌లపై, రోడ్లపైగాని దుకా ణాలు ఏర్పాటు చేయరాదని, ప్రజలు నడిచేందుకు ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారని, వాటిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టంచేశారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు

ఇచ్ఛాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో బెల్టు షాపులు నిర్వహించినా, వాటికి ప్రోత్సహించినా బాధ్యుతలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం ఎక్సైజ్ స్టేషన్‌లో పాత కేసుల్లో పట్టుబడిన 18 మందిని పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం వారి తహసీల్దార్ ఎన్.వెంకటరావు ఎదుట బైండోవర్ చేశా మన్నారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తే మద్యం షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

కవిటి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఇచ్ఛాపురం ఏఎంసి చైర్మన్ మణిచంద్రప్రకాష్ అన్నారు. పెద్ద కపాసుకుద్దిలో మంగళవారం తుఫాన్ బాధిత మత్స్యకారులకు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బాసుదేవ్ ప్రదాన్, టీడీపీ మండల అధ్యక్షుడు పి.కృష్ణారావు, నేతలు బాసుదేవ్ రౌళో, ఎస్.వెంకటరమణ, బి.గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటితో ఇబ్బందులు

సరుబుజ్జిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రొట్టవలస గ్రామంలో అలికాం-బత్తిలి ప్రధాన రహదారి పక్కన ఉన్న ఎస్సీ, బీసీ కాలనీల్లోని సీసీ రోడ్లపై మురుగునీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏమాత్రం వర్షం పడినా మోకాళ్ల లోతు నీరు రోజుల తరబడి నిలువ ఉండి దుర్గంధంగా తయారవుతోదని, దీంతో దోమలు ఉత్పత్తి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలో ఎటువంటి పారి శుధ్య పనులు చేపట్టకపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని వాపోతున్నారు. తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు నీరు నిలిచినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చింతాడ యాళ్లవీధిలోనూ..

ఆమదాలవలస, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధి ఏడో వార్డు చింతాడ గ్రామం యాళ్ల వీధిలో మురుగునీటితో స్థానికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పారిశుధ్య పనులు చేపట్టకపోవడం, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మరింత దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చింతాడ, అలికాం ప్రధాన రహదారి అవతల వైపునకు మురుగునీరు వెళ్లిపో యేదని, నిర్మాణాలు చేపట్టడంతో నీరు నిలిచిపోతోందని చెబుతున్నారు. పలుమార్లు మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


అలికాం-బత్తిలి మార్గంలో, చింతాడ యాళ్ల వీధిలో సీసీ రోడ్లపై నిలిచిన మురుగునీరు

న్యూస్ బాక్స్

హిందీ మెటీరియల్ పంపిణీ

ఇచ్ఛాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు హిందీ మెటీరియల్‌ను హెచ్‌ఎం ప్రమీల మంగళవారం అందజేశారు. స్టడీ మెటీరియల్‌ను పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు నరేంద్రనాథ్ పట్నాయక్ సొంతంగా తయారుచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ పోటీలు

ఇచ్ఛాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం స్థానిక బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలో ఎల్.మేనక, ఎ.చందు, డి.రాణిరెడ్డి వరుసగా మొదటి మూడు బహుమతులు, క్విజ్ పోటీలో అంజలి బెహరా, ఎల్.మేనక, వై.అర్చనప్రియ, వక్తృత్వ పోటీలో అంజలి బెహరా, ఆశి చందు, వై.అర్చనప్రియ వరుసగా మొదటి మూడు బహుమతులను వరుసగా పొందినట్లు నిర్వాహకులు తెలిపారు.

తుఫాన్ బాధితులకు పరామర్శ

కంచిలి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌కు సాలీనపుట్టుగ గ్రామానికి చెందిన సాలీన ఢిల్లీరావు ఇంటిగోడ కూలిపోవడంతో మంగళవారం ఎమ్మెల్సీ నర్తు రామారావు బాధితులను పరామర్శించారు. ఎంపీపీ దేవదాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు పరిశీలన

గార, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వత్సవలస పంచాయతీ పేర్లవానిపేటలో నిర్వహిస్తున్న ఈ-పంట నమోదు ప్రక్రియను మంగళవారం ఆర్డీవో సాయి పత్యూష పరిశీలించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.చక్రవర్తి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

11 నుంచి ఉచిత ఉపాధి శిక్షణ

ఎచ్చెర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి సంస్థలో ఈనెల 11 నుంచి ఎలక్ట్రీషియన్, ఏసీ రిఫ్రిజిరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎన్.రాంజీ ఒక ప్రకటనలో తెలిపారు. 19నుంచి 45 ఏళ్ల లోపు ఉమ్మడి జిల్లాలోని యువకులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. 30 రోజులు నిర్వహించనున్న శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల యువకులు 79933 40407, 95534 10809 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే 'జుత్తు'కు నివాళి

కవిటి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పలాస మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు వర్ధంతిని మంగళవారం కె.కపాసుకుద్ది గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళి అర్పించారు. పలాస నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు దమ్ముంటే అసెంబ్లీకి రావాలి

● మీ ఐదేళ్ల పాలనకు..
మా 16 నెలల పాలనకు తేడా చూపిస్తాం
● కిష్టుపురం సభలో మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'జగన్‌రెడ్డి మీడియా ముందు మాట్లాడడం కాదు. నీకు దమ్ముంటే రైతులపై చర్చించడానికి అసెంబ్లీకి రావాలి.' అని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. మంగళవారం కిష్టుపురం గ్రామంలో రూ.28.50లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు. 'మొంథా తుఫాన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ అధికారులు, ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేయడంతో ప్రాణనష్టం లేకుండా చేశారు. తుఫాన్ సమయంలో బెంగళూరులో ఉన్న జగన్‌రెడ్డి ఇప్పుడు రైతులు వద్దకు వచ్చి సొల్లు కబుర్లు చెబుతున్నారు. మీ ఐదేళ్ల పాలనలో.. మా 16నెలల పాలనలో రైతులకు చేసిన మేలుపై చర్చించడానికి నీకు దమ్ముంటే అసెంబ్లీకి రావాలి. కాశీబుగ్గ వేంకటేశ్వస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన 9 మందికి రాష్ట్ర ప్రభుత్వం రూ.15లక్షలు చొప్పున, కేంద్ర ప్రభుత్వం రూ.2లక్షల చొప్పున పరిహారం అందించాయి. టెక్కలి నియోజకవర్గానికి చెందిన ముగ్గురి మృతులకు టీడీపీ సభ్యత్వం ఉండడంతో వారి కుటుంబాలకు అదనంగా మరో రూ.5లక్షలు అందజేశాం. ఉత్తరాంధ్ర వెనుకబడి ఉండటంతో ఏ రాష్ట్రంలో ప్రమాదం జరిగిన అందులో ఈ మూడు జిల్లాల వారు తప్పనిసరిగా ఉంటున్నారు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఉత్తరాంధ్రలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పరిశ్రమల స్థాపనకు ఇక్కడ ప్రజలు సహకరించాలి. గత ఐదేళ్లలో కిష్టుపురంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 16 నెలల్లో రూ.2కోట్లు వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేశాం. మరో ఆరు నెలల్లో వంశధార రిజర్వాయర్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తాం. ఇచ్చిన మాట ప్రకారం రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ. 7వేలు వేశాం. ఈ వారంలో మరో రూ.7వేలు, డిసెంబరులో మిగతా రూ. 6వేలు జమచేస్తాం.'అని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు వెలమల విజయలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, నాయకులు కామేశ్వరరావు, రామకృష్ణ, కర్రి అప్పారావు, సాసుమంతు ఆనంద్, బాడాన చిన్నారావు, ముత్తురాజు, నంబాళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

యువకుడి అనుమానాస్పద మృతి


సాయి (ఫైల్)

శ్రీకాకుళం క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన బలగ సాయి (25) ఎచ్చెర్ల మండలం కాళింగపేట గ్రామ సమీపంలో నాగావళి నదిలో శవమై తేలిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలి పిన వివరాలిలా ఉన్నాయి.. నగరంలోని మంగువారితోటకు చెందిన బలగ సాయి కుటుంబ సభ్యులతో వెల్డింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి బయటకు వెళతానని చెప్పి కుటుంబ సభ్యులతో చెప్పి ఎప్పటికీ రాలేదు. దీంతో ఫోన్ చేసినా స్పందించకపోవ డంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఎచ్చెర్ల మండలం కాళింగపేట నాగావళి తీరం వద్ద గుర్తు తెలియని మృతదేహం స్థానికులకు కనిపించడంతో వారు ఎచ్చెర్ల పోలీసులకు సమాచారమిచ్చారు. ఎచ్చెర్ల ఎస్ఐ సందీప్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని ఒంటిపై ఉన్న దుస్తులు, శరీర ఆకృతిని చూసి బలగ సాయిగా గుర్తించి ఆయన కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఎచ్చెర్ల ఎస్ఐ సందీప్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. సాయి మద్యం సేవించి ఆదివారంరాత్రి వరకు ఓయువతితో వీడియో కాల్‌లో మాట్లాడినట్టు, అనంతరం ఏం జరిగిందోగాని నది లో శవమై కనిపించినట్టు పోలీసులు తెలిపారు. ఈ కోణంలో దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

పాముకాటుతో వృద్ధురాలు..

నందిగాం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బోరుభద్ర గ్రామానికి చెందిన తిర్లంగి అమ్మన్న (68) అనే వృద్ధురాలు పాముకాటుకు గురై మంగళవారం మృతి చెందింది. ఎస్ఐ షేక్‌మహ్మద్ ఆలీ వివరాల మేరకు.. గతనెల 27న తన ఇంటి పెరట్లోని బాత్‌రూమ్‌లోకి వెళ్లిన అమ్మన్నను పాముకాటు వేసింది. కుటుంబ సభ్యులు ఆమెను టెక్కలి ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. అమ్మన్న పెద్ద కుమార్తె బమ్మిడి జయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అమ్మన్నకు దివ్యాంగుడైన కుమారుడు మల్లేశ్వరరావు ఉన్నాడు.

పశువుల షెడ్ దగ్ధం

● రెండు ఆవులు, రెండు దూడలు సజీవ దహనం

రణస్థలం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాతర్లపల్లి పంచాయతీ వేంకటేశ్వర కాలనీలో పిన్నింటి అప్పలనాయుడుకు చెందిన పశువుల షెడ్ సోమవారం రాత్రి అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో నాలుగు పశువులు మృత్యువాత పడ్డాయి. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అందరూ నిద్రలో ఉన్న సమయంలో అర్ధరాత్రి పశువుల షెడ్‌లో సంభవించిన అగ్ని ప్రమాదానికి రెండు ఆవులు, రెండు దూడలు అగ్నికి ఆహుతయ్యాయి. షెడ్‌లో ఉన్న ఆటో, స్కూటీ దగ్ధమయ్యాయి. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందో తెలియడం లేదని, తీవ్రంగా నష్టపోయానని బాధితుడు కన్నీరు మున్నీరవుతున్నాడు. బాధిత కుటుంబానికి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు పిన్నింటి సాయి, సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ మంగళవారం పరామర్శించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్టపరిహారం కోసం కృషి చేస్తామన్నారు.

పోలీసుల అదుపులో మోస్ట్ వాంటెడ్ నేరస్థుడు?

శ్రీకాకుళం క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓ మోస్ట్ వాంటెడ్ నేరస్థుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. మెళియాపుట్టి మండలం చాపర రెల్లివీధికి చెందిన దున్న కృష్ణ (50) ఆరు భాషల్లో మాట్లాడుతూ ఇళ్లకు కన్నం వేస్తూ పోలీసులకు దొరక్కుండా తిరుగుతున్నాడు. జిల్లాలో ఇతనిపై పలు చోట్ల కేసులు నమోదయ్యాయి. దీంతో పోలీసులు అయనను మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా గుర్తించి ఇటీవల పోస్టర్లను విడుదల చేశారు. ఇతని సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని, బహుమతి ఇస్తామని పోస్టర్లలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్య ప్రదేశంలో విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

వజ్రపుకొత్తూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని ఎస్ఐ బి.నిహర్ అన్నారు. మంగళవారం పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వద్దు.. సంతోషకరమైన జీవితం ముద్దు అని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా బంగారు జీవితాన్ని కాపాడుకోవాలని కోరారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ పట్నాయక్, అధ్యాపకులు కేశవ, ఝాన్సీ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే రోజులన్నీ సోలార్‌వే

టెక్కలి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజులన్నీ సోలార్ వ్యవస్థవేనని రష్యాకు చెందిన ఊరల్ ఫెడరల్ విశ్వవిద్యాలయ సైంటిస్ట్ ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక సదస్సులో ఆయన మాట్లాడారు. సోలార్ ప్యానళ్ల ఉష్ణ నియంత్రణ విధానాలు, స్మార్ట్ శీతలీకరణ, సాంకేతికత అభివృద్ధి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, హెచ్‌వోడీ శివశంకరరాజు, భానుచంద్రరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఆదేశం


కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

పాతపట్నం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు తెలిపారు. మంగళవారం కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోలు జరగలేదంటూ ఏఒక్కరైతూ ఇబ్బందిపడని విధంగా సేవలందించాలని కలెక్టర్ సూచించారని ప్రత్యేకాధికారి కరుణాకరరావు తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా కూడా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు, ఎంపీడీవో సీహెచ్ రమణమూర్తి, పీఆర్ డీఈఈ చంద్రునాయుడు, గ్రామీణ నీటి సర ఫరా ఏఈ ఉదయ్‌భాస్కర్, ఈవో వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర ఆలయంలో భస్మాభిషేకం


భస్మాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

టెక్కలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టుమహాదేవి కోనేరు దరి రామలింగేశ్వర ఆలయంలో మంగళవారం స్వామివారికి భస్మాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం కావడంతో భక్తులు పెద్దఎత్తున తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అర్చకుడు తర్లా శివకుమార్ భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ● టెక్కలిలోని శ్యామసుందరస్వామి ఆలయంలో అర్చకులు రమేష్‌పండా ఆధ్వర్యంలో నక్షత్రహారతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రోమ్ చక్రవర్తిలా పవన్‌కల్యాణ్

● ఆయన నిద్రావస్థలో ఉన్నారు
● బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్


మాట్లాడుతున్న బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్

పలాస, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సమస్యలపై తనకు సంబంధం ఉందోలేదో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రజలకు స్పష్టం చేయాలని భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏఘటన జరిగినా నగరం కాలిపోతుంటే రోమ్ చక్రవర్తి ఫిడేలు వాయించిన చందంగా పవన్‌కళ్యాణ్ ఉన్నారన్నారు. పలాస కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక ఏకాదశి సందర్భంగా తొక్కిసలాట జరిగి 9 మంది మరణించడం.. 18 మంది గాయపడడం బాధాకరమన్నారు. క్షతగాత్రులు, మృతుల బంధువులను పరామర్శించేందుకు ఆయన మంగళవారం పలాస కాశీబుగ్గకు వచ్చారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.50వేలు, గాయాలతో చికిత్స పొందుతున్న వారికి రూ.10వేల చొప్పున సాయాన్ని అందించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో విలేకర్లతో మాట్లాడారు. మహిళలపై దాడులు, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ఏం సంబంధం లేనట్లు పవన్ కళ్యాణ్ నిద్రావస్థలో ఉన్నారని విమర్శించారు. ఆయనకు అధికారం లేకున్నా కేవలం ఉత్సవ విగ్రహం లాంటి పదవులు ఉన్నాయన్నారు. పలాస ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం ప్రైవేటు ఆలయమని తప్పించునే ప్రయత్నం చేయడం తగదన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థలు, పరిశ్రమలు, ఆసుపత్రుల్లో ఇలాంటి ఘటనలు జరిగితే తమకు సంబంధం లేదని ప్రకటనలు ఇస్తారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిఘా, పోలీసు వ్యవస్థను రాజకీయాలకు వినియోగించుకుంటున్నారని ఆరోపించారు.

క్షతగాత్రులను పరామర్శించిన సీనియర్ న్యాయాధికారి హరిబాబు


క్షతగాత్రుడితో మాట్లాడుతున్న న్యాయాధికారి హరిబాబు

పలాస, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పలాస ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాశీబుగ్గ తొక్కిసలాట క్షతగాత్రులను సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.హరిబాబు మంగళవారం పరామర్శించారు. సరైన వైద్యం అందుతుందా లేదా?, అందరికీ నష్టపరిహారం అందిందా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు టి.పాపినాయుడు, కూన మోహన్‌బాబుతో మాట్లాడారు. కార్యక్రమంలో కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహమూర్తి, పోలీసులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

బాలియాత్రకు ప్రముఖులకు ఆహ్వానం


కలెక్టర్‌కు ఆహ్వానం పలుకుతున్న కమిటీ సభ్యులు

జలుమూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో ఈనెల 9న నిర్వహించనున్న బాలియాత్రకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడుతో పాటు కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎస్పీ మహేశ్వర రెడ్డిని ఆహ్వానించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బాలియాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశాలున్నందున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని వారు కోరారు. కమిటీ సభ్యులు సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎస్‌వీ చలం, తర్ర బలరాం, మొజ్జాడ రామారావు, సూర సాయి, కొత్తకోట శ్రీనివాసరావు, న్యాయవాది చింతాడ వెంకటరావు పాల్గొన్నారు.

భారీ వాహనంతో ప్రజల ఇబ్బందులు



భారీ వాహనంతో స్తంభించిన ట్రాఫిక్

కొత్తూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు మీదుగా ఛత్తీస్‌గఢ్‌కు భారీ యంత్రాన్ని తీసుకెళ్తున్న ఓ వాహనంతో స్థానికులు మంగళవారం ఇబ్బందులకు గురయ్యారు. ఈ భారీ వాహనం వెళ్లేందుకు పైన ఉన్న విద్యుత్ తీగలు అడ్డుగా ఉండడంతో అధికారులు వాటిని తొలగించారు. రోజంతా సరఫరాను నిలుపుదల చేయడంతో ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. అలాగే, ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. భారీ వెళ్లిపోయిన తరువాత మంగళవారం సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శాంతి

ఎల్.ఎన్.పేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం తగదని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై మంగళవారం యంబరాం గ్రామంలో కోటి సంతకాలు, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని నెరవేర్చకుండా ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్. జ్యోతిలక్ష్మి, వైసీపీ మండల అధ్యక్షుడు పి.విష్ణు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గీత కార్మికులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు


పాలతలగాంలో సమావేశమైన కల్లుగీత కార్మికులు

సంతబొమ్మాళి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులను ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గొర్లె ఎర్రయ్య, దుబ్బ కోటేశ్వరరావు అన్నారు. పాలతలగాం గ్రామంలో ఏర్పాటు చేసిన గీత కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. గీత కార్మికుల స్థితిగతులపై ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. సంఘాన్ని బలోపేతం చేయడమే తమ తక్షణ కర్తవ్యం అన్నారు. చెట్టుకు పన్ను కట్టించుకోవాల్సింది పోయి, పన్ను రద్దు చేస్తూ గీత కార్మికుల సొసైటీలను దెబ్బతీసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. కల్లును శీతల పానీయంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గీత కార్మికులు కొన్ని నారాయణరావు, లక్ష్మణరావు, శ్రీనివాస్, కృష్ణరాజారావు, ప్రసాద్, వీరాస్వామి, రామ్మూర్తి, త్రినాథరావు, రాంబాబు, సతీష్ తదితరులు ఉన్నారు.

జగన్నాయకులకు నివాళి


జగన్నాయకులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

హరిపురం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మందస మండలం బేతాళపురంలో దివంగత మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగన్నాయకులు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడి సింహాద్రి, బి.లక్ష్మణ్, గుంటు పార్వతి, లింగరాజు, జుత్తు పాపారావు, అప్పలస్వామి, పితంబరం తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



కొత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కొత్తూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం అధ్యక్షుడు సవర రమేష్ కోరారు. మంగళవారం కొత్తూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు శ్రీను, రామారావు, ఆదినారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

సంతబొమ్మాళి, నవంబరు4(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని ఆ పార్టీ జిల్లా అధ్య క్షుడు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. మంగళవారం మలగాం పంచాయతీ దేపల్లివానిపేటలో జరిగిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం ప్రపంచంలోనే అన్ని రంగాల్లో దూసుకుపోతుందని అన్నారు. అనంతరం దేపల్లివానిపేట గ్రామపెద్ద దేపల్లి కామయ్య ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు చింతాడ చిన్నారావు, బైపల్లి గౌరి తదితరులు పాల్గొన్నారు.


బీజేపీలో చేరిన దేపల్లివానిపేట గ్రామస్థులు

ఆలయాల్లో భద్రత కల్పించాలి

మెళియాపుట్టి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో భక్తులకు భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన ఆలయాలు భద్రమేనా? అనే కథనంపై ఆయన స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం సచివాలయ సిబ్బందితో మండల పరిషత్ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ప్రైవేట్, ప్రభుత్వ ఆలయాలు ఎన్ని ఉన్నాయో వివరాలు సేకరించాలని ఆదేశించినట్లు తెలిసింది. కాశీబుగ్గ వంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రసాద్‌పండా తెలిపారు.

'విద్యాప్రగతి' ప్రారంభం

నందిగాం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదేశాల మేరకు జయపురం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యాప్రగతి కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు పి.గవిరేసు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చదువులో ముందంజలో పయనించి ఉత్తమంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ పి.ప్రకాశరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కొత్త వ్యక్తులపై సమాచారం ఇవ్వాలి

నరసన్నపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసులు గ్రామాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ ఎస్ఐ ప్రమీలాదేవి సూచించారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్ వద్ద మహిళా పోలీసులతో సమీక్ష నిర్వహించారు. రగ్గులు, దుప్పట్లు అమ్ముతున్నట్లు గ్రామాల్లో తిరుగుతున్న వారిపై నిఘా పెట్టాలన్నారు. కొత్తవ్యక్తులు గ్రామాల్లోకి వస్తే వెంటనే వారి వివరాలను తీసుకోవాలని, అనుమానితులుగా గుర్తిస్తే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యాక్రమంలో ఏఎస్ఐలు అసిరినాయుడు, తులసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి

సంతబొమ్మాళి, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో మరువాడ పంచాయతీలో వరిపంట పూర్తిగా దెబ్బతిందని, వెంటనే రైతులకు నష్ట పరిహారం అందించాలని సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, జిల్లా తెలుగుయువత కార్యదర్శి సూరాడ దాసురాజు కోరారు. ఈ మేరకు మంగళవారం మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేశారు. రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసి వరి పంటను సాగు చేశారని, తుఫాన్‌తో వరద నీటిలో మునిగిపోయి పూర్తిగా కుళ్లిపోయిందన్నారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.

పిల్లల వ్యాక్సిన్‌పై నిర్లక్ష్యం తగదు

సంతబొమ్మాళి, నవంబరు4(ఆంధ్రజ్యోతి): పిల్లలకు వ్యాక్సిన్ వేయడంలో నిర్లక్ష్యం తగదని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మేరీ కేథరిన్ అన్నారు. మంగళవారం నౌపడ ప్రాథమిక కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. చిన్నారులకు వ్యాక్సిన్ వేయడంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పదిహేను రోజులైనా వ్యాక్సిన్ ఎందుకు వేయలేదని సిబ్బందిని ప్రశ్నించారు. సంబంధిత ఆశ కార్యకర్తల నుంచి లిఖితపూర్వక వివరణ తీసుకున్నారు. అనంతరం మెమోలు జారీ చేశారు. సమావేశంలో వైద్యాధికారి పరిమళ పాల్గొన్నారు.

రోడ్డుపై గోతులు పూడ్చాలి

టెక్కలి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): టెక్కలి అంబేడ్కర్ జంక్షన్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గోతులను పూడ్చాలని బీజేపీ స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ చిట్టిబారికి లింగరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం రోడ్డుపై కూర్చొని నిరసన తెలియ జేశారు. గోతుల కారణంగా వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని, తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. గోతుల్ని పూడ్చాలని అధికారులకు పలుమార్లు వినతులు అందించినా స్పందన కరువైందన్నారు. ఇప్పటికైనా స్పందించి గోతులు పూడ్చాలని కోరారు.

శ్రీముఖలింగేశ్వరుని ఆదాయం రూ.1.58 లక్షలు

జలుమూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం శ్రీముఖలింగేశ్వరునికి రూ.1,58,467 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఏడుకొండలు తెలిపారు. ప్రత్యేక దర్శనం టికెట్లు, ప్రసాదం విక్రయం, ఆలయ విశిష్టత పుస్తకాల విక్రయం ద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

గ్రంథాలయాలు ఆహ్లాదకరంగా ఉండాలి

పాతపట్నం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల పరిసరాల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని పెంపొందించాలని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వీజీఎస్ శంకరరావు అన్నారు. పాతపట్నం శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. వివిధ రికార్డులను పరిశీలించారు. ఎంతమంది పాఠకులు వస్తున్నారని శాఖాగ్రంథాలయాధికారి డి.సాయమ్మ, సహాయకుడు జి.సోమేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు.

కార్యాలయం నిర్మాణానికి స్థల పరిశీలన

జలుమూరు(సారవకోట) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సారవకోట మండలంలో నూతన రెవెన్యూ కార్యాలయ భవనం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మంగళవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో కలెక్టర్ స్పందించి కొత్త భవన నిర్మాణానికి రూ.1.75 కోట్లు మంజూరు చేశారని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉన్న రెవెన్యూ కార్యాలయ సమీపంలోని ఖాళీ స్థలంలో నూతన భవనం నిర్మించనున్నట్లు చెప్పారు. పరిశీలనలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీపీ కూర్మినాయుడు పాల్గొన్నారు.